
సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

గురువారం ; 20 ; జూలై ; 2023



నిండుతున్న నీటి వనరులు

జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో తాలిపేరు, కిన్నెరసాని, పెదవాగు తదితర ప్రాజెక్టులు జలకళ సంతరించుకున్నాయి. 8లో



ఉద్యానానికి 'ఉపాధి' రాయితీ

ఉపాధి హామీ పథకంలో పనిచేసే చిన్న, సన్నకారు రైతులు ఉద్యానవన పంటలు సాగు చేస్తే ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోంది. 10లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 27° / 24°

జిల్లాలో గురువారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రామయ్యకు స్నపన తిరుమంజనం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామివారి ఉత్సవ మూర్తులకు అర్చకులు వైభవోపేతంగా స్నపన తిరుమంజనం జరిపించారు. ప్రతి బుధవారం స్వామివారికి ఈ వేడుక నిర్వహిస్తారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కేయూ పీహెచ్‌డీ ప్రవేశాల ఇంటర్వ్యూలు వాయిదా

కేయూ క్యాంపస్: రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తుండడంతో కాకతీయ విశ్వవిద్యాలయంలో గురువారం నుంచి జరగాల్సిన పీహెచ్‌డీ రెండో కేటగిరీ ప్రవేశాల ఇంటర్వ్యూలను నిరవధికంగా వాయిదా వేసినట్లు కేయూ రిజిస్ట్రార్ ఆచార్య శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం కేయూ క్యాంపస్‌లో వీసీ ఆచార్య తాటికొండ రమేశ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఇంటర్వ్యూలు తిరిగి ఎప్పుడు నిర్వహించేది త్వరలోనే ప్రకటిస్తామని రిజిస్ట్రార్ తెలిపారు. అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించాలని, వివరాల కోసం కేయూ వెబ్‌సైట్‌లో చూడాలని శ్రీనివాసరావు సూచించారు.

క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు ఎంపిక



ఎంపిక పోటీలకు హాజరైన బాలురు

కొత్తగూడెంటౌన్: క్రీడా పాఠశాలల్లో 4, 5 తరగతుల్లో ప్రవేశాలకు బుధవారం కొత్తగూడెం క్లబ్‌లో జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా యువజన, క్రీడలశాఖ అధికారి టి.సీతారాం మాట్లాడుతూ.. 70 మందికి పైగా బాలురు జిల్లాస్థాయి ఎంపికల్లో పాల్గొని ప్రతిభ చాటారని చెప్పారు. బుధవారం హాజరుకాని వారు గురువారం జరిగే పోటీలకు రావచ్చని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఉదయ్‌కుమార్, సిబ్బంది తిరుమలరావు, లక్ష్మయ్య, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ స్టెల్లా, పీడీ, పీఈటీలు ప్రేమ్, నరేష్, వేణు, నాగేశ్వరరావు, మంగీలాల్, కదీర్, నాగలక్ష్మి పాల్గొన్నారు.

కొత్తగూడెం ఆర్డీఓగా శిరీష

భద్రాచలానికి మాధవి



సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం ఆర్డీఓ స్వర్ణలత ఖమ్మం ఆర్డీఓగా బదిలీ అయ్యారు. ఖమ్మం డీఆర్‌ఓగా విధులు నిర్వహిస్తున్న ఆర్.శిరీష కొత్తగూడెం ఆర్డీఓగా నియమితులయ్యారు. జిల్లాలో అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వహించిన కర్నాటి వెంకటేశ్వర్లు భూపాలపల్లి అదనపు కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. భద్రాచలం ఆర్డీఓగా కె.మాధవిని నియమించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

రామాలయ ఉద్యోగుల విధుల్లో మార్పులు

భద్రాచలం: శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో పనిచేసే ఉద్యోగుల విధులలో స్వల్ప మార్పులు చేస్తూ ఈఓ రమాదేవి బుధవారం ఉత్తర్వులు విడుదల చేశారు. ల్యాండ్ అండ్ లీజెస్ విభాగం చూస్తున్న సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డికి ఎస్టాబ్లిష్‌మెంట్, ఔట్ సోర్సింగ్, లీజెస్ విభాగాలను, సీసీగా ఉన్న అనిల్‌కుమార్‌కు అదనంగా ల్యాండ్స్, లీగల్ విభాగాన్ని, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావుకు కల్యాణ కట్ట, అన్నదానం నిర్వహణ, క్యాష్ రెమిటెన్స్ బాధ్యతలను అప్పగించారు. జూనియర్ అసిస్టెంట్ ఎం.స్వర్ణకుమారికి అదనంగా సెంట్రల్ స్టోర్స్, ఫైల్ కరస్పాండెన్స్, ఔట్‌సోర్సింగ్, ఉద్యోగి సాయి శ్రీనివాస్‌కు ప్రధాన టికెట్ కౌంటర్ నిర్వహణ, క్రాంతికుమార్‌కు శాశ్వత పూజల విభాగం కరస్పాండెన్స్‌తో పాటు మరికొంత మంది విధుల్లో మార్పులు చేస్తున్నట్లు వివరించారు.

అప్రమత్తం కావాలి



భద్రాచలంలో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక

పునరావాస కేంద్రాలు సిద్ధం చేయండి

- నిత్యావసర వస్తువులు సరిపడా నిల్వచేయాలి
- ప్రభావిత ప్రాంతాలకు లైఫ్ జాకెట్లు, పడవలు
- వరద సహాయ చర్యలపై సమీక్షలో కలెక్టర్ ప్రియాంక

కంట్రోల్ రూమ్ నంబర్లు	
కలెక్టర్ కార్యాలయం	08744-241950
కొత్తగూడెం ఆర్డీఓ	93929 19750
భద్రాచలం ఆర్డీఓ	08743-232444
వాట్సాప్ నంబర్	93929 19743

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఎగువ ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఎ. ప్రియాంక ఆదేశాలు జారీ చేశారు. గోదావరికి వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో అందించాల్సిన సహాయ చర్యలపై బుధవారం ఆమె భద్రాచలంలో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ముందుగానే సురక్షిత ప్రాంతాలకు..

గోదావరి వరద ప్రమాద హెచ్చరికలను అనుసరించి ముంపు ప్రాంతాల ప్రజలను ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో విద్యుత్, నిత్యావసర వస్తువుల కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్యాస్ సిలిండర్లు, పెట్రోల్, డీజిల్ స్టాక్ అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ముఖ్యంగా వరద కారణంగా రాకపోకలు నిలిచిపోయే చర్ల, దుమ్ముగూడెం మండలాల తహసీల్దార్లు ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దీంతో పాటు ప్రజలను తరలించేందుకు గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో ఉన్న ట్రాక్టర్లను వినియోగించుకోవాలన్నారు. రోడ్లపైకి నీరు చేరిన చోట, భద్రాచలంలో స్నానఘట్టాల దగ్గర బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

సెలవులు రద్దు

రానున్న మూడు రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తాయనే అంచనాల నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగులకు సెలవులు రద్దు చేసినట్టు కలెక్టర్ వెల్లడించారు. అత్యవసర సేవలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఉద్యోగులంతా కార్యక్షేత్రాల్లో అందుబాటులో ఉండాలని సూచించారు. దీంతో పాటు వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రసవానికి సిద్ధంగా ఉన్న గర్భిణులను గుర్తించి దగ్గరలో ఉన్న ఆస్పత్రులకు తరలించాలని చెప్పారు. అత్యవసర వైద్య సేవలు అందించేందుకు అంబులెన్సులు, ఆర్బీకే వాహనాలు అందుబాటులో ఉంచాలన్నారు. భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో ప్రత్యేక ఐసీయూ వార్డు ఏర్పాటు చేయాలని వైద్యాధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

మునక ఉండొద్దు

లోతట్టు ప్రాంతాల్లోని పశువులు ముంపునకు గురికాకుండా ఎత్తయిన ప్రదేశాలకు తరలించాలని కలెక్టర్ సూచించారు. వాటికి అంటు వ్యాధులు రాకుండా వ్యాక్సినేషన్ చేయాలన్నారు. ప్రభుత్వం దగ్గర అందుబాటులో ఉన్న లైఫ్ జాకెట్లు, పడవలను మండలాల వారీగా పంపిణీ చేయాలని, వీటిని ఆయా తహసీల్దార్ల వద్ద ఉంచాలని సూచించారు. చేపల వేటకు వెళ్లకుండా మత్స్యకారులను నియంత్రించాలన్నారు. అవసరం లేకుండా ఇల్లు వదిలి బయటకు రావద్దని ప్రజలను కోరారు. నాటు పడవలు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది సిద్ధంగా ఉన్నారని, అత్యవసర సమయంలో వారి సేవలు ఉపయోగించుకోవాలని చెప్పారు. ఇంకా అవసరమైతే సింగరేణి, బీపీఎల్, కేటీపీఎస్ రెస్క్యూ టీమ్‌లను సైతం పిలవాలన్నారు.

తాగునీటికి ఇక్కట్లు రావొద్దు..

వరద సమయంలో మంచినీటి సరఫరాలో ఇబ్బందులు రాకుండా జాగ్రత్తగా ఉండాలని మిషన్ భగీరథ అధికారులకు కలెక్టర్ ప్రియాంక సూచించారు. ఎక్కడైనా సమస్య ఎదరైతే ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలన్నారు. నిరుపయోగంగా ఉన్న బోర్లను వినియోగంలోకి తేవాలని చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కర్నాటి వెంకటేశ్వర్లు, భద్రాలచం ఏఎస్పీ పరితోశ్ పంకజ్, ఆర్డీఓ రత్నకళ్యాణి, డీపీఓ రమాకాంత్, ఆర్‌అండ్‌బీ ఈఈ భీమ్లా, జిల్లా వైద్యాధికారి డాక్టర్ శిరీష, డీసీహెచ్‌ఎస్ రవిబాబు, అగ్నిమాపక శాఖాధికారి శ్రీనివాస్, డీఎస్‌ఓ మల్లికార్జున్, పశుసంవర్ధక శాఖ డీడీ పురంధర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పువ్వాడ టెలీ కాన్ఫరెన్స్

రానున్న మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలతో మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కలెక్టర్‌తో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎప్పటికప్పుడు ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని, అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ముఖ్యంగా నీటి పారుదలశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని చెప్పారు. ముంపు ప్రాంతాల వారిని ప్రత్యేక శిబిరాలకు తరలించాలని మంత్రి ఆదేశించారు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు వీలుగా అదనపు సిబ్బందితో పాటు పడవలు, లైఫ్ జాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

తీర ప్రాంతంలో కలియదిరుగుతూ..

గోదావరి వరద ఉధృతి, ముంపు ప్రాంతాల్లో పరిస్థితిని ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు కలెక్టర్ ప్రియాంక ప్రయత్నించారు. ఈ క్రమంలో ఉదయం పది గంటలకు కొత్తగూడెం నుంచి బయలుదేరి నేరుగా చర్లకు చేరుకున్నారు. అక్కడ తాలిపేరు ప్రాజెక్టును పరిశీలించారు. ఆ తర్వాత చర్ల మండలంలో ముంపునకు గురయ్యే గ్రామాల వివరాలు, చేపట్టబోయే సహాయక కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం దుమ్ముగూడెం మండలం సున్నంబట్టి గ్రామాన్ని సందర్శించారు. అక్కడి ప్రజలతో మాట్లాడి గత వరదల సమయంలో ఎదురైన అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి భద్రాచలం చేరుకుని మధ్యాహ్న భోజనం అనంతరం వరద సహాయ కార్యక్రమాలపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆ తర్వాత పట్టణంలోని విస్తా కాంప్లెక్స్, స్నాన ఘట్టాల వద్దకు వెళ్లి పరిశీలించారు. మొత్తంగా ఉదయం నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు గోదావరి తీర ప్రాంతంలో కలెక్టర్ కలియదిరిగారు.



తాలిపేరు వద్ద వరద పరిస్థితిని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రియాంక, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

గోదారి ఉరకలు..



భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం

- నదిలోకి క్రమంగా పెరుగుతున్న నీటిమట్టం
- ఇప్పటికే 35 అడుగులకు పైగా ప్రవాహం
- అప్రమత్తమైన అధికార యంత్రాంగం
- గతేడాది అనుభవాలతో బెంబేలెత్తుతున్న ముంపు వాసులు

బూర్గంపాడు: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరి ఉరకలెత్తుతోంది. ఐదురోజుల క్రితం కొంతమేర పెరిగిన గోదావరి ఆ తర్వాత తగ్గింది. ప్రస్తుతం రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో ఎగువ ప్రాంతాల్లోని జలాశయాల్లోకి భారీగా నీరు చేరగా, ఆ నీటిని గోదావరిలోకి వదులుతున్నారు. దీంతో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం మంగళవారం రాత్రి నుంచి క్రమేపీ పెరుగుతోంది. బుధవారం వరద ఉధృతి మరింత పెరగడంతో రాత్రి 11 గంటల వరకు 35.7 అడుగులకు చేరింది. వరద భయంతో గోదావరి పరీవాక ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గతేడాది అనుభవాలను గుర్తు చేసుకుంటూ బెంబేలెత్తుతున్నారు. గోదావరి వరద పెరుగుతున్న నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల బుధవారం భద్రాచలంలో వరద సహాయక చర్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు.

ప్రాజెక్టుల్లోనూ పెరుగుతున్న వరద..

ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో చర్ల మండలంలోని తాలిపేరు జలాశయానికి భారీగా వరదనీరు చేరుతోంది. దీంతో ఇరిగేషన్‌శాఖ అధికారులు 17 గేట్లు ఎత్తి గోదావరిలోకి నీటిని వదులుతున్నారు. శబరి నదికి కూడా భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. గోదావరి ఉపనదులైన ప్రాణహిత, కిన్నెరసాని నుంచి కూడా వరద నీరు గోదావరిలో చేరుతోంది. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 43 అడుగులకు చేరితే మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. 48 అడుగులకు రెండు, 53 అడుగులకు చేరితే మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు.

గతేడాది భారీ నష్టం..

భద్రాచలం డివిజన్‌లోని బూర్గంపాడు, చర్ల, దుమ్ముగూడెం, అశ్వాపురం, మణుగూరు, పినపాక, భద్రాచలం మండలాలు గోదావరి పరీవాహక ప్రాంతాల్లో ఉన్నాయి. గతేడాది గోదావరి వరదలకు ఈ మండలాల్లో వేలాది ఎకరాల పంటలు నీటమునిగి తీవ్రనష్టం వాటిల్లింది. వేల సంఖ్యలో ఇళ్లు నీటమునగగా, ప్రజలు సర్వం కోల్పోయారు. రహదారులు జలదిగ్బంధంలో మునిగి పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు వెళ్లాల్సిన ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు ఎక్కడివక్కడే ఆగిపోయాయి. వాహనాల డ్రైవర్లు, క్లీనర్లు రోజుల తరబడి రోడ్లపైనే కాలం వెళ్లదీశారు. ముంపు బాధితుల కోసం 60కి పైగా పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయగా, వారం రోజుల పాటు అక్కడే తలదాచుకున్నారు. వరదల అనంతరం నీటమునిగిన ఇళ్లను చూసి కన్నీటి పర్యంతమయ్యారు. లోతట్టు ప్రాంతాల ప్రజలకు కట్టుబట్టలే మిగిలాయి. ఇక ఈ ఏడాది ఇప్పుడిప్పుడే గోదావరి వరద పెరుగుతుండడంతో బాధితులు మళ్లీ ఆందోళనకు గురవుతున్నారు.

బొగ్గు ఉత్పత్తికి అంతరాయం

సింగరేణి(కొత్తగూడెం)/టేకులపల్లి : రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో సింగరేణిలో రోజుకు 70 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలుగుతోంది. ఇక సింగరేణి వ్యాప్తంగా రోజుకు 13,97,580 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ వెలికితీయాల్సి ఉండగా 33,472 క్యూబిక్ మీటర్లు మాత్రమే తీస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే రానున్న మూడు రోజుల్లో లక్షల టన్నుల్లో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలుగుతుందని అధికారులు ఆందోళన చెందుతున్నారు. ఓసీల్లో భారీగా చేరిన నీటిని ప్లాంటూన్ పంపుల ద్వారా బయటకి తీయిస్తున్నారు. టేకులపల్లి మండలంలోని కోయగూడెం ఓపెన్‌కాస్టులో బొగ్గు, ఓబీ పనులకు అంతరాయం ఏర్పడింది. రోజువారీ బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 8,192 టన్నులు కాగా, బుధవారం 6 వేల టన్నుల మాత్రమే ఉత్పత్తి అయిందని, 54 వేల క్యూబిక్ మీటర్ల ఓబీ వెలికితీత పనులకు బ్రేక్ పడిందని అధికారులు తెలిపారు.



కొత్తగూడెంలోని జీకే ఓసీలో చేరిన వర్షపు నీరు

వర్షంలోనూ సీపీఎస్ పోరుయాత్ర

కలెక్టరేట్ ఎదుట ఉద్యోగుల ధర్నా

సూపర్‌బజార్(కొత్తగూడెం): సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలనే డిమాండ్‌తో టీఎస్ సీపీఎస్‌ఈయూ ఆధ్వర్యంలో ఈ నెల 6న గద్వాలలో మొదలైన పాతపెన్షన్ సాధన సంకల్ప యాత్రను బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నాతో ముగించారు. తొలుత వర్షంలోనే సింగరేణి ప్రధాన కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు మోటారుసైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ మాట్లాడుతూ లక్షా 72 వేల మంది ఉద్యోగులతో పాటు వారి కుటుంబ సభ్యులు మొత్తం ఎనిమిది లక్షల మంది సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకోవాలని, సీపీఎస్‌ను రద్దుచేసి, ఓపీఎస్‌ను ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. వచ్చే నెల 12న 8 లక్షల మందితో చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలవల శ్రీకాంత్, కోశాధికారి నరేష్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు తుక్కాని శ్రీనివాసరెడ్డి, ప్రధానకార్యదర్శి రాజశేఖర్, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు

గెస్ట్ లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 2023 – 24 విద్యాసంవత్సరంలో గెస్ట్ లెక్చరర్ పోస్టుల భర్తీకి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని డీఐఈఓ సులోచనరాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం 45 పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. అర్హత గల వారు ఎస్సెస్సీ నుంచి పీజీ వరకు ఒరిజినల్ మెమోలతో పాటు మూడు సెట్ల జిరాక్స్ కాపీలతో ఈనెల 20 నుంచి 24 వరకు తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రానున్నది ఇందిరమ్మ రాజ్యమే..

డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య

కరకగూడెం: ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న సీఎం కేసీఆర్, ప్రధాని నరేంద్రమోదీలకు రానున్న ఎన్నికల్లో ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని డీసీసీ అధ్యక్షుడు, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య అన్నారు. కరకగూడెంలో బుధవారం ఆయన పార్టీ మండల కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. దేశంలో, రాష్ట్రంలో వచ్చేది ఇందిరమ్మ రాజ్యమేనని ధీమా వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే రేగా కాంతారావు కాంగ్రెస్ పార్టీ గుర్తుపై గెలిచి కార్యకర్తలను, పార్టీని మోసం చేసి బీఆర్‌ఎస్‌కు అమ్ముడుపోయారని విమర్శించారు. ప్రతిపక్ష నాయకులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసే సీఎం కేసీఆర్ లాంటి వ్యక్తిని గతంలో ఎప్పుడూ చూడలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో 10కి 10 స్థానాలు కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందుతారని చెప్పారు. ఇందుకోసం కార్యకర్తలు అహర్నిశలూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు చందా లింగయ్య దొర, పాయం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పొదెం వీరయ్య

ఇంకా సాధారణమే..

- ఆదుకుంటున్న ప్రస్తుత వర్షాలు
- అత్యధికంగా దుమ్ముగూడెంలో 165.4 మి.మీ.
- సుజాతనగర్‌లో 9.4 మి.మీ.మాత్రమే



పాల్వంచ మండలంలో పత్తి చేనులో చేరిన నీరు

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో వానలు దంచికొడుతున్నా ఇప్పటివరకు సాధారణ వర్షపాతమే నమోదైంది. మరో రెండు రోజులు ఇలాగే కొనసాగితే అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. ప్రస్తుత వర్షాలతో చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల్లో జలకళ సంతరించుకుంటోంది. దుమ్ముగూడెం మండలంలో బుధవారం అత్యధికంగా 165.4 మి.మీ. వర్షపాతం నమోదు కాగా, సుజాతనగర్ మండలంలో అత్యల్పంగా 9.4 మి.మీ. వర్షం కురిసింది. మొత్తం 23 మండలాల్లో 1,184.4 మి.మీ. వర్షం పడగా, జిల్లా సగటు వర్షపాతం 51.5 మి.మీ.గా ఉంది. కరకగూడెం, పినపాక, చర్ల, ఆళ్లపల్లి, గుండాల, పాల్వంచ, భద్రాచలం, ములకలపల్లి మండలాల్లో జూన్ 1 నుంచి ఇప్పటివరకు సాధారణం కంటే తక్కువగానే వర్షపాతం నమోదైంది. అశ్వాపురం, మణుగూరు, ఇల్లెందు, టేకులపల్లి, చంద్రుగొండ చుంచుపల్లి, కొత్తగూడెం, లక్ష్మీదేవిపల్లి, బూర్గంపాడు, దమ్మపేట మండలాల్లో సాధారణ, దుమ్ముగూడెం, జూలూరుపాడు, అన్నపురెడ్డిపల్లి, సుజాతనగర్, అశ్వారావుపేట మండలాల్లో సాధారణం కంటే ఎక్కువగా వర్షపాతం నమోదైంది.

జిల్లాలో జూన్ నుంచి ఇప్పటివరకు వర్షపాతం వివరాలిలా(మి.మీ.)

మండలం	వర్షపాతం	లోటు/అధికం	మండలం	వర్షపాతం	లోటు/అధికం
కరకగూడెం	357.4	లోటు 49.0	చంద్రుగొండ	281.0	అధికం 13.3
పినపాక	360.2	లోటు 27.1	అన్నపురెడ్డిపల్లి	299.8	అధికం 57.0
చర్ల	411.1	లోటు 26.6	చుంచుపల్లి	319.7	లోటు 11.7
దుమ్ముగూడెం	394.4	అధికం 42.6	సుజాతనగర్	304.6	అధికం 20.9
అశ్వాపురం	364.1	అధికం 4.0	కొత్తగూడెం	324.1	లోటు 8.7
మణుగూరు	374.6	లోటు 10.9	లక్ష్మీదేవిపల్లి	309.9	లోటు 7.3
ఆళ్లపల్లి	305.6	లోటు 26.9	పాల్వంచ	334.2	లోటు 20.8
గుండాల	313.6	లోటు 36	బూర్గంపాడు	366.5	లోటు 17.9
ఇల్లెందు	313.2	అధికం 1.4	భద్రాచలం	356.5	లోటు 29.7
టేకులపల్లి	300.1	అధికం 16.6	ములకలపల్లి	359.6	లోటు 33.3
జూలూరుపాడు	301.3	అధికం 32.8	దమ్మపేట	314.0	అధికం 0.1
			అశ్వారావుపేట	296.8	అధికం 39.4

వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి



జిల్లాలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురుస్తుండడంతో వ్యవసాయ పనులు ఊపందుకుంటున్నాయి. వ్యవసాయాధికారుల సలహాలు, సూచలను పాటిస్తూ రైతులు అధిక దిగుబడులు పొందేలా సాగు చేయాలి.

– కొర్స అభిమన్యుడు, జిల్లా వ్యవసాయాధికారి

సంతోషంగా ఉంది



వర్షాలు పంటలకు తగిన విధంగా కురుస్తుండడంతో సంతోషంగా ఉంది. జూన్ నెలలో వానలు లేక భయపడ్డాం. కానీ ఈ నెలలో కురుస్తున్న వర్షాలు పంటలను ఆదుకుంటున్నాయి.

– మూడు బన్సీ, రైతు, మంగపేట

క్లుప్తంగా

బీజాపూర్‌లో పేలిన మందుపాతర

● తప్పిన ప్రాణ నష్టం

చర్ల: సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో ప్రధాన రహదారిపై మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలగా, ఎటువంటి ప్రాణనష్టం లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. బీజాపూర్ జిల్లాలోని సోమన్‌పల్లి సమీపంలో ఉన్న ప్రధాన రహదారిపై బుధవారం ఉదయం శక్తిమంతమైన మందుపాతర పేలగా నాలుగు అడుగుల మేర గుంత ఏర్పడింది. సాధారణంగా మావోయిస్టులు ప్రధాన రహదారులపై పోలీసులను లక్ష్యంగా చేసుకుని, వారి వాహనాలు రాకపోకలు సాగించే క్రమంలో మందుపాతరలు పేల్చుతుంటారు. సోమన్‌పల్లిలో బుధవారం తెల్లవారుజామున ఏదైనా వాహనం ఈ మార్గం గుండా వెళ్తున్న సందర్భంలో పేల్చి గురి తప్పారా? లేక ఈ నెల 28 నుంచి ఆగస్టు 3 వరకు జరిగే మావోయిస్టు పార్టీ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల నేపథ్యంలో ఈ ఘటనకు పాల్పడ్డారా? అని అక్కడి పోలీసు వర్గాల్లో చర్చ జరుగుతోంది.

కూలిన ఇల్లు


కూలిన గుడిసె వద్ద వృద్ధురాలు

సుజాతనగర్: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండల పరిధిలోని లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన భూక్యా భూరి అనే మహిళ గుడిసె కూలిపోయింది. ఈమె నివాసం పల్లపు ప్రాంతంలో ఉండటంతో చుట్టుపక్కలా వరద నీరు చేరింది. ఒంటరిగా జీవిస్తున్న వృద్ధురాలికి పునరావాసం కల్పించాలని పలువురు కోరుతున్నారు.

విద్యార్థిని ఆత్మహత్య

కొత్తగూడెంటౌన్: ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కొత్తగూడెం పట్టణ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. కొత్తగూడెం పట్టణ పరిధిలోని దుర్గన్‌బస్తీ (గణేష్‌బస్తీ)లో నివాసం ఉంటున్న బొర్రి శ్రీ విద్య(21) ఖమ్మంలో బీటెక్ చదువుతోంది. తన తల్లి రాజేంద్ర(లక్ష్మి), తమ్ముడితో కలిసి ఇటీవల మంచిర్యాలకు వెళ్లింది. కాగా బుధవారం ఉదయం ఒక్కతే కొత్తగూడెం వచ్చింది. తల్లి ఫోన్ చేయగా ఎంతకు లిఫ్ట్ చేయకపోవడంతో ఇంటి పక్కనే ఉన్న తన చెల్లికి ఫోన్ చేయగా, ఆమె వెళ్లి చూసేసరికే ఉరివేసుకుని మృతి చెంది ఉంది. విద్యార్థిని తండ్రి శ్రీను గతంలోనే చనిపోయాడు. మృతురాలి తల్లి, తమ్ముడు మంచిర్యాల నుంచి రావాల్సిఉందని, వారొచ్చాక పూర్తి వివరాలు తెలుస్తాయని సంఘటనా స్థలాన్ని పరిశీలించిన వన్‌టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు.

యువకుడి బలవన్మరణం

దమ్మపేట: ఆత్మహత్యకు పాల్పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటనపై బుధవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని వడ్లగూడెం గ్రామానికి చెందిన వల్లెపు కేశవరావు(35) కుటుంబ కలహాల నేపథ్యంలో జీవితంపై విరక్తి చెంది మంగళవారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని సత్తుపల్లిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి సోదరుడు వల్లెపు నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రవికుమార్ తెలిపారు.

ఆర్టీసీ బస్సు, కారు ఢీ


● దంపతులకు గాయాలు

అశ్వాపురం: ఆర్టీసీ బస్సు, కారు ఢీకొని భార్యాభర్తలకు స్వల్పగాయాలైన సంఘటన బుధవారం జరిగింది. మండల కేంద్రంలోని గౌతమీనగర్ కాలనీకి చెందిన భూక్యా నాగరాజు తన భార్యతో కలిసి కారులో అశ్వాపురం గ్రామ శివారులో హెచ్‌పీ పెట్రోల్ బంక్ నుంచి బయటకు వస్తున్నాడు. ఈ క్రమంలో ఖమ్మం నుంచి మణుగూరు వెళ్తున్న మణుగూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కారును ఢీకొట్టింది. దీంతో కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. కారులో ఉన్న దంపతులకు స్వల్ప గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు ఆర్టీసీ డ్రైవర్ సురేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జితేందర్ తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న గూడ్స్ రైలు

అశ్వాపురం: మండల పరిధిలోని గొందిగూడెం గ్రామంలో రైలు పట్టాలపై బుధవారం బైక్‌ను గూడ్స్ రైలు ఢీకొట్టింది. మణుగూరు మండలం కూనవరం గ్రామానికి చెందిన పాయం శ్రావణ్ బైక్‌పై తుమ్మలచెరువు గ్రామ పంచాయతీలోని భీమవరం గ్రామంలో బంధువుల ఇంటికి వచ్చాడు. కూనవరం వెళ్లేందుకు బైక్‌పై గొందిగూడెం నుంచి అశ్వాపురం వెళ్లేందుకు వస్తున్నాడు. ఇసుకవాగు పొంగి వంతెన నిర్మాణం కారణంగా రాకపోకలు లేకపోవడంతో రైలు పట్టాలపై వెళ్లేందుకు బైక్‌ను రైలు పట్టాలు దాటించేందుకు ప్రయత్నించాడు. ఆ సమయంలో గూడ్స్ రైలు రావడంతో శ్రావణ్ దూరంగా పరుగెత్తాడు. బైక్ ముందు భాగం పట్టాలపై ఉండటంతో రైలు స్వల్పంగా ఢీకొట్టింది. కొత్తగూడెం రైల్వే పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి బైక్‌ను కొత్తగూడెం రైల్వే పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,623

నిండుతున్న నీటి వనరులు

● 398.50 అడుగులకు చేరిన కిన్నెరసాని నీటిమట్టం
● తాలిపేరు నుంచి వరదనీరు దిగువకు విడుదల
● అలుగు పోస్తున్న పలు చెరువులు, కుంటలు

పాల్వంచరూరల్: రెండు, మూడు రోజులుగా జిల్లాలో ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులూ వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. అక్కడక్కడా చెరువులు, కుంటలు అలుగుపోస్తున్నాయి. కిన్నెరసాని, పెదవాగు, తాలిపేరు ప్రాజెక్టులు జలకళ సంతరించుకుంటున్నాయి. పలుచెరువులు అలుగు పోస్తుండగా, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎగువ నుంచి వస్తున్న వరదతో కిన్నెరసాని జలాశయం నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. 407 అడుగుల నీటి నిల్వసామర్థ్యం కలిగిన కిన్నెరసానిలో 4,074 క్యూసెక్కుల వరద వస్తుండటంతో బుధవారం నీటిమట్టం 398.50 అడుగులకు చేరింది.

లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కిన్నరసాని ప్రాజెక్ట్ గేట్లు ఎప్పుడైనా ఎత్తే అవకాశం ఉందని, లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రాజెక్టు ఇంజనీర్ సురేష్ తెలిపారు. ప్రాజెక్టులోకి వరద చేరుతున్న దృష్ట్యా ఈ నెల 19 నుంచి వచ్చే నెల 13వ తేదీ వరకు నీటిమట్టం పెరుగుదలను బట్టి గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తామని పేర్కొన్నారు. వీలైనంత వరకు రాత్రి 8 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు దిగువకు నీటిని వదులుతామని, గేట్లను ఎత్తేముందు సైరన్‌మోగిస్తామని, నదీ పరీవాహక ప్రాంతం రైతులు వ్యవసాయ విద్యుత్ మోటార్లను, పంపుసెట్లను భద్రపరుచుకోవాలని వివరించారు.


కిన్నెరసాని జలాశయంలో పెరిగిన నీటిమట్టం

రాళ్లవాగుకు అలుగు..

మండల పరిధిలోని సత్యనారాయణపురం, మందెరకలపాడు గ్రామాల మధ్య ఉన్న రాళ్లవాగు ప్రాజెక్ట్ బుధవారం నుంచి అలుగుపోస్తోంది. ప్రాజెక్ట్ కింద 3,350 ఎకరాల ఆయకట్టు ఉంది. దీంతో ఇప్పటివరకు వర్షాలు, సాగునీటి కోసం ఎదురుచూస్తున్న రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.


అలుగు పోస్తున్న రాళ్లవాగు ప్రాజెక్ట్

ఉప్పొంగుతున్న వాగులు

గుండాల: వర్షంతో గుండాల, ఆళ్లపల్లి మండలాల్లోని వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. గుండాల–కొడవటంచ మధ్య కిన్నెరసాని వాగు లోలెవల్ బ్రిడ్జిపై నుంచి ఉప్పొంగి ప్రవహిస్తోంది. దీంతో నాగారం, కొడవటంచ, పాలగూడెం, దొంగతోగు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మల్లన్న వాగు సైతం ఉధృతరూపం దాల్చుతోంది. ఆళ్లపల్లి మండలంలో జల్లేరులో కూడా వరద పెరుగుతోంది. ఓ మోస్తరుగా ప్రవహిస్తోంది. పలుచోట్ల చెరువుల్లోకి వరదనీరు వచ్చి చేరుతోంది. అక్కడక్కడా పంటచేన్లు నీటమునిగాయి. లోతట్టు ప్రాంతాలు, అంతర్గత రోడ్లు జలమయమయ్యాయి. కిన్నెరసాని వాగు ఉధృతిని ఎస్సై రాజశేఖర్ పరిశీలించారు. ఎవరూ వాగు దాటకుండా చర్యలు తీసుకున్నారు.


కొడవటంచ వద్ద లోలెవల్ బ్రిడ్జిపై కిన్నెరసాని ప్రవాహం

అన్నపురెడ్డిపల్లిలో 43.4 మి.మీ వర్షపాతం

అన్నపురెడ్డిపల్లి: మండలంలో 43.4 మి.మీ వర్షపాతం నమోదైంది. భారీ వర్షానికి వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. చెరువులు, కుంటలు జలకళ సంతరించుకుంటున్నాయి. అబ్బుగూడెం-కట్టుగూడెం గ్రామాల మధ్య రహదారిపై ఈదుల వాగు ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి.


రహదారిపై వరద నీటిని దాటుతున్న కూలీలు

నీట మునిగిన రహదారి

చర్ల: దుమ్ముగూడెం మండలంలోని సున్నంబట్టి బైరాగులపాడు గ్రామాల మధ్యలోని ప్రధాన రహదారి నీటమునిగింది. కేశవాపురం, బైరాగులపాడు, కాశీనగరం, చిన నల్లబల్లి గ్రామాలతో పాటు ఎగువన అటవీ ప్రాంతం నుంచి కూడా వర్షపు నీరు వస్తుండటంతో రోడ్డు మునిగిపోయింది. బుధవారం తెల్లవారుజాము నుంచి సున్నంబట్టి గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి.


సున్నంబట్టి-బైరాగులపాడు గ్రామాల మధ్యలో రహదారిపై నిలిచిన వరదనీరు

తాలిపేరుకు వరద ఉధృతి

చర్ల: తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్ట్‌కు వరద ఉధృతి కొనసాగుతోంది. బుధవారం ప్రాజెక్ట్‌కు చెందిన 4 గేట్లను పూర్తిగా, 17 గేట్లను 4 అడుగుల మేర ఎత్తి ఉంచి వరదనీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 730 ఎంసీఎఫ్‌టీ కాగా, ప్రాజెక్ట్ భద్రతను దృష్టిలో ఉంచుకుని 363.674 ఎంసీఎఫ్‌టీ వద్ద నీటి నిల్వ క్రమబద్ధీకరిస్తున్నారు. పూర్తిస్థాయి నీటి మట్టం 74 మీటర్లు కాగా ప్రస్తుతం 71.64 మీటర్లుగా నీటి మట్టాన్ని కొనసాగిస్తున్నారు. బుధవారం ప్రాజెక్ట్ వద్ద 60 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇరిగేషన్ ఈఈ రాంప్రసాద్, డీఈ తిరుపతి వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

నీట మునిగిన సీతమ్మ నార చీరల ప్రదేశం

చర్ల: భారీగా కురుస్తున్న వర్షాలకు పర్ణశాల సమీపంలోని సీతవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో సీతమ్మ వారి నారచీరల ప్రాంతం నీటమునిగింది. పర్ణశాల రామయ్య దర్శనానికి వచ్చే భక్తులందరూ సీతమ్మ నారచీరల ప్రాంతాన్ని సందర్శించి అక్కడి విశేషాలను అడిగి తెలుసుకుంటారు. ఈ ప్రాంతం నీట మునగడంతో భక్తులు సీతమ్మ వారి నారచీరల ప్రాంతాన్ని దర్శించుకోలేకపోతున్నారు. ఏటా వర్షాకాలంలో భక్తులకు ఇదే పరిస్థితి ఎదురవుతోంది.

పెదవాగులో స్వల్పంగా పెరిగిన నీటిమట్టం


పెదవాగు ప్రాజెక్టులోకి చేరిన వరదనీరు


అచ్యుతాపురంలో అలుగుపోస్తున్న నర్సింహాసాగర్ చెరువు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గుమ్మడవల్లి వద్దగల పెదవాగు వాగు ప్రాజెక్టులో బుధవారం స్వల్పంగా నీటి మట్టం పెరిగింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షంతో ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లోని కొండవాగు, పెద్ద, చిన్న వాగుల నుంచి వరద నీరు చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 21 అడుగులు కాగా, బుధవారం రాత్రికి ఆరు అడుగులుగా నమోదైంది.

నిండిన నర్సింహాసాగర్..

అశ్వారావుపేట మండలంలోని వెంకమ్మ చెరువు, గుండేటి వాగు, దబ్బతోగు, అనంతారం, తిరుమలకుంట చెరువుల్లోకి వరద నీరు వచ్చి చేరుతోంది. అచ్యుతాపురం వద్ద ఉన్న నర్సింహా సాగర్ చెరువు నిండి అలుగు పోస్తోంది. దీంతో ఆయా చెరువుల ఆయకట్టు రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఊట్లపల్లి, వినాయకపురం, జమ్మిగూడెం, కేశప్పగూడెంతోపాటు పలు గ్రామాల్లో వరి నాట్లు వేసే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

గిరిజన గ్రామాలకు నిలిచిన రాకపోకలు

అశ్వాపురం: మండలంలో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఇసుకవాగు పొంగి ప్రవహిస్తోంది. దీంతో గొందిగూడెం, గొందిగూడెం కొత్తూరు, ఎలకలగూడెం, మనుబోతులగూడెం గ్రామ పంచాయతీలకు రాకపోకలు నిలిచాయి. ఇసుకవాగుపై రూ.7 కోట్లతో వంతెన మంజూరు కాగా గత మే 29న రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు శంకుస్థాపన చేశారు. అశ్వాపురం–గొందిగూడెం రహదారిపై లోలెవల్ వంతెనను తొలగించి వంతెన పనులు చేపడుతున్నారు. అశ్వాపురం–గొందిగూడెం రహదారిపై రాకపోకలకు తాత్కాలికంగా అప్రోచ్ రహదారి ఏర్పాటు చేశారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పటిష్ట చర్యలు తీసుకోకపోవడంతో అప్రోచ్ రోడ్డు వరద ప్రవాహానికి కోతకు గురైంది. దీంతో గిరిజన గ్రామాల ప్రజలకు అవస్థ తప్పడంలేదు. అధికారులు, కాంట్రాక్టర్ స్పందించి తాత్కాలిక రహదారిని పటిష్టంగా ఏర్పాటు చేయాలని గిరిజనులు కోరుతున్నారు.


గొందిగూడెంలో ఇసుకవాగు ప్రవాహంతో కోతకు గురైన తాత్కాలిక రహదారి

అర్చకుల వేతనాల పెంపు ఘనత కేసీఆర్‌దే..

ఖమ్మంగాంధీచౌక్: అర్చకుల వేతనాలను పెంచిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని ధూప దీప నివేదన అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దౌలతాబాద్ వాసుదేవశర్మ అన్నారు. ఖమ్మం మామిళ్లగూడెంలోని గాయత్రిభవన్‌లో ఉమ్మడి ఖమ్మం జిల్లా ధూప దీప నివేదన అర్చకుల ఆత్మీయ సమ్మేళనం బుధవారం నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. రూ.2,500 గౌరవ వేతనంతో పనిచేస్తున్న ధూప దీప నివేదన అర్చకుల వేతనాన్ని కేసీఆర్ రూ.10 వేలకు పెంచారని తెలిపారు. అర్చకుల జీవన స్థితిగతులు మెరుగుపర్చేందుకు కృషి చేసిన ముఖ్యమంత్రి, ప్రభుత్వానికి అంతా కృతజ్ఞులుగా ఉండాలని సూచించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవజ్జుల ప్రసాద్‌శర్మ మాట్లాడుతూ సంఘానికి అర్చకులంతా సమానమేనని, ఎవరికి అన్యాయం జరిగినా పోరాడుతామని తెలిపారు. ధూప దీప నివేదన అర్చక సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు మునగలేటి రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కార్యదర్శి మరిగంటి భార్గవాచార్యులు, భద్రాద్రి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అంజినికుమార్ శర్మ, పురాణం కిరణ్‌శర్మతో పాటు ఆమంచి సురేష్‌శర్మ, పి.అచ్యుతరామారావు, కె.భానుప్రకాష్, జిల్లా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు వాసుదేవశర్మ

వ్యవసాయ బావిలో పడ్డ మతిస్థితిమితం లేని వ్యక్తి

రక్షించిన పోలీస్, అగ్నిమాపక సిబ్బంది

పాల్వంచ: మతి స్థితిమితంలేని వ్యక్తి వ్యవసాయ బావిలో జారి పడి చెట్ల కొమ్మలకు చిక్కుకోగా, స్థానికులు, పోలీస్, ఫైర్ సిబ్బంది కలిసి బయటకు తీశారు. స్థానికుల కథనం ప్రకారం.. పట్టణంలోని సీతారాంపట్నం శివారులో ఓ వ్యవసాయ బావిలో బుధవారం మతిస్థితిమితం లేని వ్యక్తి జారి పడ్డాడు. బావి అంచులకు పెద్ద ఎత్తున చెట్ల పొదలు ఉండగా వాటికి చిక్కుకుని ఉన్నాడు. గుర్తించిన స్థానికులు 100,108కి సమాచారం ఇచ్చారు. దీంతో అక్కడికి చేరుకున్న పోలీస్, అగ్నిమాపక సిబ్బంది తాడుసాయంతో బావిలోకి దిగి మతిస్థిమితంలేని వ్యక్తిని బయటకు తీశారు. అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సుమారు 20 అడుగుల నీటి లోతు ఉన్న బావిలో జారిపడినప్పటికీ చెట్లపొదలకు చిక్కడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. కాగా అతని వివరాలు తెలియాల్సి ఉందని సీఐ వినయ్‌కుమార్ తెలిపారు.


మతి స్థితిమితంలేని వ్యక్తిని రక్షించిన పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది

రైస్ మిల్లుల్లో బియ్యం సీజ్

పాల్వంచ: పట్టణంలోని అల్లూరి సెంటర్‌కు చెందిన రామాంజనేయ, వాసవీ రైస్ మిల్లుల్లో బుధవారం పోలీసులు తనిఖీలు చేపట్టారు. డీఎస్పీ ఎస్.వెంకటేష ఆధ్వర్యంలో ఆకస్మికంగా తనిఖీలు చేశారు. రామాంజనేయ మిల్లులో 300 క్వింటాలు, వాసవీ రైస్ మిల్లులో 150 క్వింటాల పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించి తహసీల్దార్ రంగా ప్రసాద్, సివిల్ సప్‌లై డీటీ ఎస్.కృష్ణలకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని పరిశీలించి సీజ్ చేశారు. బియ్యం శాంపిల్స్‌ను ల్యాబ్‌కు తరలించారు. ల్యాబ్ రిపోర్ట్ వచ్చాక రైస్ మిల్లుల నిర్వాహకులపై కేసులు పెట్టే అవకాశం ఉంటుందని సీఐ వినయ్‌కుమార్, ఎస్‌ఐలు నరేశ్, నాగ భిక్షం తెలిపారు.


బియ్యాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

లైంగికదాడి ఘటనలో నిందితుడి అరెస్ట్

పాల్వంచ: లిఫ్ట్ అడిగిన మహిళను బైక్‌పై నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం సీఐ వినయ్‌కుమార్ వివరాలు వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం... ఈ నెల 17న రాత్రి నటరాజ్ సెంటర్ వద్ద ఇంటికి వెళ్లేందుకు ఆటో కోసం ఓ మహిళ ఎదురుచూస్తోంది. ఈ క్రమంలో లాడ్జిలో పనిచేసే బొల్లేరుగూడేనికి చెందిన చాపలమడుగు రమేష్ అనే వ్యక్తి.. మీ ఇంటి వైపే వెళుతున్నానని, మీరు ఎక్కడ పనిచేస్తారో తెలుసని మహిళకు మాయమాటలు చెప్పి బైక్ ఎక్కించుకున్నాడు. అనంతరం కేటీపీఎస్ కాలనీలోని నిర్మానుష్యంగా ఉన్న ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, 24 గంటల్లో నిందితుడు రమేష్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ ప్రవీణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూల్ బస్సు ఢీకొని ఒకరు మృతి

దమ్మపేట: స్కూల్ బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలోని అర్బన్ కాలనీ శివారులో బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. దమ్మపేట శివారు శ్రీకృష్ణ కాలనీకి చెందిన తాళ్ల సురేష్(31) తన బైక్‌పై ఇద్దరు పిల్లలను స్కూల్‌లో దింపి, తిరిగి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో దమ్మపేట గ్రామ పరిధిలోని అర్బన్ కాలనీ శివారు గంగారంలోని ఓ ప్రైవేట్ పాఠశాల బస్సు అతివేగంతో వస్తూ ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. దీంతో తలకు బలమైన గాయాలు కావడంతో తీవ్ర రక్తస్రావం జరిగి సురేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి సత్యనారాయణ ప్రమాద సంఘటనపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.


ప్రమాద స్థలంలో ప్రైవేట్ పాఠశాల బస్సు


తాళ్ల సురేష్ (ఫైల్)

వరదనీటిలో చిక్కుకున్న యువకులు

రక్షించిన రెవెన్యూ అధికారులు

చర్ల: మండలంలోని కొత్తపల్లి సమీపంలో ఉన్న గోదావరి లంక (కోరెగడ్డ)లోకి గేదెలను తోలుకొచ్చేందుకు వెళ్లి వరదనీటిలో చిక్కుకున్న ఇద్దరు యువకులను రెవెన్యూ అధికారులు రక్షించారు. దండుపేటకు చెందిన బంటు రాజు, జగదీష్ గోదావరి వరద పెరుగుతుండటంతో లంకలో ఉన్న గేదెలను తోలుకువచ్చేందుకు వెళ్లారు. తిరిగి వచ్చే క్రమంలో గోదావరి ఉధృతి పెరిగి దారి మునిగింది. దీంతో వారు తహసీల్దార్ బి.భరణిబాబుకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. తహసీల్దార్ ఆర్‌ఐ వెంకటేశ్వరావును పంపించి మరపడవల ద్వారా లంకలోకి వెళ్లి అక్కడ చిక్కుకున్న యువకులను క్షేమంగా తీసుకొచ్చారు.


అధికారుల సాయంతో బయటకొచ్చిన యువకులు

ముగ్గురిపై కేసు నమోదు

పాల్వంచరూరల్: ప్రహరీ కూల్చిన ఘటనలో ముగ్గురిపై బుధవారం కేసు నమోదైంది. మండల పరిధిలోని జగన్నాథపురానికి చెందిన అన్నదమ్ములు పెండ్లి సత్యనారాయణరెడ్డి, శ్రీనివాసరెడ్డి ఇళ్ల మధ్య ప్రహరీ విషయమై వివాదం నెలకొంది. ఈమేరకు శ్రీనివాసరెడ్డి, అతని భార్య అరుణ, కుమారుడు వినయ్ ట్రాక్టర్‌తో ప్రహరీని కూల్చారని, తనను చంపుతామని బెదిరించారని సత్యనారాయణరెడ్డి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

భార్యను వేధిస్తున్న భర్తపై..

అశ్వారావుపేటరూరల్: భార్యను వేధింపులకు గురి చేస్తున్న భర్తపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై బి.రాజేశ్ కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని వినాయకపురానికి చెందిన హనీఫ్ ఫాతిమా, అబ్దుల్ హఫీజ్‌కు 2017లో వివాహం జరగగా ఇద్దరు సంతానం ఉన్నారు. కాగా అబ్దుల్ హఫీజ్ కొద్దిరోజులుగా భార్యను దుర్భాషలాడుతూ, వేధిస్తున్నాడు. బాధితురాలి ఫిర్యాదుతో భర్తపై గృహహింస చట్టం కింద కేసు నమోదు చేశారు.

రోడ్డుప్రమాదంలో ఐదుగురికి గాయాలు

కరకగూడెం: రోడ్డు ప్రమాదంలో ఐదుగురు గాయపడిన ఘటన జిల్లా సరిహద్దులోని ములుగు జిల్లా తాడ్వాయి మండలం రంగాపురంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. మండలంలోని రఘునాథపాలెం గ్రామానికి చెందిన పులి సాయికుమార్, కొమరం చందు, పోలెబోయిన ప్రశాంత్, సారయ్య ఆటోలో మేడారం వెళ్లి తిరిగి వస్తుండగా రంగాపురం వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీ కొట్టింది. దీంతో ఈ నలుగురితో పాటు ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించగా క్షతగాత్రులను మణుగూరు ఆస్పత్రికి తరలించారు.

24 నుంచి 'గురుకుల' హాల్‌టికెట్లు

సాక్షి, హైదరాబాద్: గురుకుల కొలువులకు అర్హత పరీక్షల సమయం ఆసన్నమైంది. ఆగస్టు 1 నుంచి ఆన్‌లైన్ పరీక్షలను నిర్వహించేందుకు తెలంగాణ గురుకుల విద్యాసంస్థల నియామకాల బోర్డు(టీఆర్ఈఐఆర్‌బీ) ఏర్పాట్లు ముమ్మరం చేసింది. తొలి పరీక్షకు సంబంధించిన హాల్‌టికెట్లను ఈనెల 24 నుంచి టీఆర్ఈఐఆర్‌బీ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని బోర్డు కన్వీనర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.


టైమ్‌టేబుల్‌లో స్వల్ప మార్పులు..

పరీక్షల టైమ్‌టేబుల్‌లో స్వల్ప మార్పులు చేసి, సవరించిన పరీక్షల షెడ్యూల్‌ను వెబ్‌సైట్‌లో అందుబాటులో పెట్టింది. ఇదివరకు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం పరీక్షలు ఆగస్టు 1వ తేదీ నుంచి 22వ తేదీ వరకు నిర్వహించాల్సి ఉండగా... తాజాగా వెల్లడించిన తేదీల ప్రకారం పరీక్షలు ఆగస్టు 1వ తేదీ నుంచి 23వ తేదీ వరకు జరగనున్నాయి. పరీక్షలు రోజుకు మూడు సెషన్లలో జరుగుతాయి. ఉదయం 8.30గంటల నుంచి 10.30గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 12.30గంటల నుంచి 2.30గంటల వరకు రెండో సెషన్, సాయంత్రం 4.30గంటల నుంచి 6.30గంటల వరకు మూడో సెషన్ జరుగుతుంది.

'నో క్యాస్ట్.. నో రిలీజియన్ కాలమ్ చేర్చాలి'

సాక్షి, హైదరాబాద్: విద్యతో పాటు ఇతర అన్ని దరఖాస్తుల్లో 'నో క్యాస్ట్', 'నో రిలీజియన్' అనే కాలమ్‌ను తప్పకుండా చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. కులాన్ని, మతాన్ని వదులుకునే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని, ఆ స్వేచ్ఛను అడ్డుకోవడం సరికాదని స్పష్టం చేసింది. ఈ మేరకు ఉత్తర్వులను వెలువరించింది. తమ కుమారుడికి నో క్యాస్ట్.. నో రిలీజియన్ సర్టిఫికెట్ ఇవ్వాలని 2019లో సండెపు స్వరూప పలుమార్లు అధికారులకు వినతి పత్రం సమర్పించారు. ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా అధికారులు పరిగణనలోకి తీసుకోలేదు. దీంతో స్వరూపతో పాటు మరొకరు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై వాదనలు విన్న జస్టిస్ కన్నెగంటి లలిత ఉత్తర్వులు జారీ చేశారు. 'పిటిషనర్ అభ్యర్థనను తిరస్కరించడం రాజ్యాంగంలోని లౌకిక స్ఫూర్తికి విరుద్ధం. ఆర్టికల్ 14,19,21,25ను ఉల్లంఘించడమే అవు తుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 కింద మత స్వేచ్ఛతో పాటు ఇలాంటి కొన్ని హక్కులు పౌరులకు ఉన్నాయి. ఏ మతాన్ని, కులాన్ని ఆచరించకూడదని ఎంచుకునే హక్కు పౌరులకు ఉంటుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 ఇదే చెబుతోంది. నో క్యాస్ట్.. నో రిలీజియన్ అనే కాలాన్ని అన్ని దరఖాస్తుల్లో (ఆన్‌లైన్‌లోనూ) చేర్చాలని మున్సిపల్ కమిషనర్లకు, పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శితో పాటు ఇతర ప్రభుత్వ శాఖలకు కూడా ఆదేశాలు జారీ చేస్తున్నాం' అని తీర్పులో పేర్కొన్నారు.

మళ్లీ లేఆఫ్స్



డౌన్ ట్రెండ్‌లో ఐటీ సెక్టార్

2022తో పోల్చితే 2023 తొలి 6 నెలల్లో అధికం

లేఆఫ్స్.ఎఫ్‌వైఐ సర్వే నివేదికలో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: లేఆఫ్స్ పెరుగుదలతో టెకీలకు మళ్లీ కష్టాలు మొదలయ్యే పరిస్థితి కనిపిస్తోంది. భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా టెకీల ఉద్వాసన పర్వం ఉధృతమవుతోంది. అమెరికా, యూరోపాతో పాటు పలు దేశాల్లో ద్రవ్యోల్బణ పెంపుతో ఐటీ, ఇతర కంపెనీల లాభాలు తగ్గిపోయాయి. ఆర్థికరంగ ఒడిదొడుకుల కారణంగా స్టార్టప్‌లలో పెట్టుబడుల సంఖ్య కూడా క్రమంగా తగ్గుముఖం పట్టిందని నిపుణులు చెబుతున్నారు.

➤ ఆరునెలల్లోనే 2,13,020 మంది టెకీలకు ఉద్వాసన

2023లో (జనవరి నుంచి జూన్) ప్రపంచవ్యాప్తంగా 2,13,020 మంది ఉద్యోగులకు ఉద్వాసన పలికినట్టు లేఆఫ్స్.ఎఫ్‌వైఐ వెబ్‌సైట్ తాజా నివేదిక వెల్లడించింది. గతేడాది 45,166 టెకీలు ఉద్యోగాలు కోల్పోగా, ఈ ఆరునెలల్లో ఉద్యోగుల లేఆఫ్‌ల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఉద్యోగులను తొలగించిన జాబితాలో అమెజాన్, మైక్రోసాఫ్ట్, గూగుల్, యాహు, మెటా, జూమ్ ఉన్నాయి.

➤ భారత్‌లోనూ ఇంచుమించు ఇదే పరిస్థితులు ఉన్నాయి. మన దగ్గర ఈ ఏడాది జనవరి నుంచి జూన్ దాకా 10,774 మంది టెకీలను తొలగించినట్టు లేఆఫ్స్.ఎఫ్‌వైఐ నివేదిక వెల్లడించింది. 2022లో ఉద్వాసనకు గురైన టెకీ ఉద్యోగుల సంఖ్య 6,530. ఈ ఏడాదితో పోల్చి చూసినప్పుడు తొలి ఆరునెలల్లో టెక్నాలజీ రంగంలో పనిచేస్తున్నవారే అధికంగా ఉద్యోగాలు కోల్పోయారు.


➤ కోవిడ్ విజృంభించిన 2020లోనూ భారత్‌లోని 12,932 మంది టెకీలు ఉద్యోగాలు కోల్పోయారు. 2021లో కొత్త స్టార్టప్‌లకు ఫండింగ్ పెరిగింది. దీంతో ఈ సంఖ్య 4,080కు తగ్గింది.

బెంగళూరు టాప్

టెకీల తొలగింపులో భారత్‌లో బెంగళూరు మొదటి వరుసలో ఉంది. ఇతర నగరాలతో పోలిస్తే అక్కడ 6,967 మంది ఉద్యోగాలు కోల్పోయారు. స్టార్టప్ హబ్‌గా రూపొందుతున్న క్రమంలో ఈ ప్రభావం అధికంగా పడినట్టు నిపుణులు చెబుతున్నారు. హైదరాబాద్‌లో లేఆఫ్‌లు పెద్దగా లేకపోవడంతో లేఆఫ్స్.ఎఫ్‌వైఐ నివేదికలో టెకీ ఉద్యోగుల తొలగింపునకు సంబంధించిన గణాంక వివరాలు పొందుపరచలేదు.


బెంగళూరు 6,967	ముంబై 1,410	గురుగ్రామ్ 1,105
న్యూఢిల్లీ 487	చెన్నై 400	

లే ఆఫ్స్.ఎఫ్‌వైఐ నివేదిక ప్రకారం భారత్‌లో గత రెండేళ్లలో (6 నెలల్లో) లే ఆఫ్‌ల తీరిదీ..



లేఆఫ్స్.ఎఫ్‌వైఐ గణాంకాల ప్రకారం 2023 తొలి ఆరునెలల్లో భారత్‌లో వివిధ రంగాల్లో 10,774 మంది తమ ఉద్యోగాలు కోల్పోయారని తన నివేదికలో పొందుపరిచింది.

వివిధ రంగాల వారీగా చూస్తే...



ఇప్పుడు స్టార్టప్‌లదీ వ్యథే...

గత శీతాకాలం నుంచి ఇప్పటిదాకా 107 ఇండియన్ స్టార్టప్‌లలో 28,046 మంది ఉద్యోగులకు లే ఆఫ్ సెగ తాకినట్టు ఐఎన్‌సీ 42 తాజా నివేదిక వెల్లడించింది. ఏడాది కాలంలో 22 భారత ఎడ్‌టెక్ స్టార్టప్‌లు 9,871 మంది ఉద్యోగులకు ఉద్వాసన పలికాయని, 59 స్టార్టప్‌లు 9,271 మంది ఉద్యోగులను తొలగించినట్టు పేర్కొన్నారు.




ఆ ఏడాది చివరి దాకా తప్పదు

ప్రస్తుత పరిస్థితులు గమనిస్తే ప్రపంచవ్యాప్తంగా ఐటీ సెక్టార్ డౌన్‌ట్రెండ్‌లోనే ఉందని చెప్పాలి. టెకీల లేఆఫ్ చేసే పరిస్థితులు ఈ ఏడాది చివరిదాకా కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. గ్లోబల్ ఎకానమీ ఎఫెక్ట్ కారణంగా ఆర్థికరంగ పరిస్థితి బాగా లేకపోవడంతో అమెరికాతో సహా ఇతరదేశాలు ప్రభావితమవుతున్నాయి. ఐటీ ఎనబుల్డ్ సర్వీసెస్‌పై ఈ ప్రభావం ఎక్కువగా ఉండగా, భారత్‌లోనే కొంత ప్రభావం తక్కువగా కనిపిస్తోంది. పాత టెక్నాలజీపై పనిచేస్తూ, పనితీరు బాగాలేని వారికి ఉద్వాసన పలికేందుకు దీనిని కంపెనీలు ఒక అవకాశంగా తీసుకున్నాయి. ఈ పరిస్థితుల ప్రభావం స్టార్టప్‌లపై తీవ్రంగా పడింది.

– రమణ భూపతి, క్వాలిటీ థాట్ గ్రూప్ చైర్మన్, ఎడ్‌టెక్ కంపెనీ

ప్రముఖ రచయిత శ్రీరమణ కన్నుమూత





మణికొండ: ప్రముఖ కథకుడు, వ్యంగ్య వ్యాసరచయిత, సినిమాగా వచ్చిన మిథునం కథా రచయిత, సీనియర్ జర్నలిస్టు శ్రీరమణ (71) బుధవారం ఉదయం కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని నెక్నాంపూర్ ఫ్లోటిల్లా గెటెడ్ కమ్యూనిటీలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య జానకి, ఇద్దరు కుమారులు చైత్ర, వంశీకృష్ణ ఉన్నారు. ఆయన అంత్యక్రియలు గురువారం మహాప్రస్థానంలో నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు. 1952 సెప్టెంబర్ 21న ఏపీలోని గుంటూరు జిల్లా వేమూరు మండలం వరహాపురం అగ్రహారంలో అనసూయ, సుబ్బారావు దంపతులకు జన్మించిన శ్రీరమణ అసలుపేరు కామరాజ రామారావు. కానీ ఆయన రచయిత శ్రీరమణగానే అందరికీసుపరిచితం.

ఏపీ సీఎం జగన్ సంతాపం

సాక్షి, అమరావతి: ప్రముఖ రచయిత, సీనియర్ జర్నలిస్ట్ శ్రీరమణ మృతిపట్ల ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన రాసిన కథలు మానవత్వం, విలువలతో కూడి ఉంటాయని జగన్ గుర్తుచేసుకున్నారు.

చమత్కార చక్రవర్తి

సాక్షి, హైదరాబాద్: సాహితీ ప్రపంచానికి సుపరిచితులైన శ్రీరమణ తెలుగులో పేరడీ రచయితగా సుప్రసిద్ధులు. అనేక మంది ప్రసిద్ధ రచయితల శైలిని అనుకరిస్తూ వందలకొద్దీ పేరడీలు రాసి స్వయంగా ఆయా రచయితల అభినందనలనూ పొందారు. అనేక పత్రికల్లో పేరడీలు, శ్రీకాలమ్, శ్రీచానెల్, చిలకల పందిరి, హాస్యజ్యోతి, మొగలిరేకులు వంటి ఎన్నో శీర్షికలు నిర్వహించారు. ఆయన మొదటి కథ వెలుగు తగ్గని వజ్రం 1970లలో ఆంధ్రప్రభలో వెలువడింది. ఆ తర్వాత బంగారు మురుగు పేరిట కథ రాశారు. మిథునం కథల సంపుటి ప్రచురించారు. ఆయన సినీ రంగంలో నూ పనిచేశారు. ఆంధ్రప్రభ, నవ్య వారపత్రికల కు సంపాదకులుగా, పత్రిక అనే మాసపత్రికకు గౌరవ సంపాదకుడిగా వ్యవహరించారు. హాస్యరచన విభాగంలో తెలుగు విశ్వవిద్యాలయం నుంచి 2014కిగాను కీర్తి పురస్కారాన్ని అందుకున్నారు.

స్కూలు రోజుల్లోనే వ్యాసరచనలు...

ఆయన ప్రాథమిక విద్యను శ్రీరామ హిందూ ప్రాథమిక పాఠశాలలో పూర్తి చేశారు. ఫస్ట్‌ఫారమ్‌లో అంటే హైస్కూలులో అడుగుపెట్టాలంటే నిర్వహించే ప్రవేశపరీక్షలో ఉత్తీర్ణులై వేమురులోని కవిరాజా జిల్లా పరిషత్ హైస్కూలులో చేరారు. ఆ పాఠశాలలో ఎస్ఎస్ఎల్సీ దాకా చదివారు. స్కూలు రోజుల్లో రామకృష్ణ మిషన్ ఆశ్రమం స్వామి వివేకానందునిపై వ్యాసరచన పోటీ నిర్వహించగా శ్రీరమణ జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి పొందారు. అలా వరుసగా ఆరేళ్లపాటు ప్రథముడిగా నిలిచారు. పన్నెండేళ్ల వయసులో విజయవాడ ఆకాశవాణి నుంచి యువజనుల కార్యక్రమంలో ఆయన ఇంటర్వ్యూ వచ్చింది.

బాల్య స్మృతులతో మిథునం...

శ్రీరమణ తన మనసులో బాల్యం నుంచి నాటుకున్న ఆలోచనలకు అక్షరరూపంగా మిథునం కథా సంపుటిని రచించారు. ఇది ఎన్నో సంప్రదాయ కుటుంబాల కథ అని ఆయన చెప్పేవారు. దీన్ని చదివి ముచ్చటపడిన దర్శకుడు బాపు స్వదస్తూరిలో ఆ కథను రాసి శ్రీరమణకు పంపారు. అమెరికాలో స్థిరపడిన ప్రముఖ సైకియాట్రిస్ట్, తెలుగు భాషాభిమాని, సాహితీప్రియుడైన డాక్టర్ వి. జంపాల చౌదరి ఆ దస్తూరితోనే మిథునం కథను ప్రచురించి ఇప్పటికి 4 లక్షల మందికి అందచేశారు.

శ్రీరమణగా పేరు మార్పు..

తాతకు మగ పిల్లలు లేకపోవడంతో పీయూసీ చదివే రోజుల్లో శ్రీరమణను ఆయన దత్తత తీసుకున్నారు. శ్రీరమణ జన్మనామం వంకమామిడి రాధాకృష్ణ కాగా, దత్తత వెళ్లాక కామరాజు రామారావుగా మార్చుకున్నారు. అయితే ఈ పేర్ల తికమక నుంచి బయటపడేందుకు తన పేరును శ్రీరమణగా మార్చుకున్నారు.

ఆ 187 మందిని విధుల్లోకి తీసుకోండి : హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: 2018లో తొలగించిన 108 అంబులెన్స్ ఉద్యోగులను మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. వీరి తొలగింపు సహజ న్యాయ సూత్రాలను, సుప్రీంకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించడమే అవుతుందని స్పష్టం చేసింది. 8 వారాల్లోగా వారిని విధుల్లోకి తీసుకోవాలని తేల్చిచెప్పింది. ప్రభుత్వం, జీవీకే సంస్థ సంయుక్తంగా రాష్ట్రంలో 108 అంబులెన్స్‌ను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అయితే తమ పని గంటలను 12 నుంచి 8 గంటలకు తగ్గించాలని 108 అంబులెన్స్ సిబ్బంది 2018, ఆగస్టులో ఆందోళన చేశారు. దీంతో ప్రభుత్వం 947 మంది సిబ్బందిని తొలగించింది. చట్టవిరుద్ధంగా తమను తొలగించడాన్ని సవాల్ చేస్తూ 2018లోనే ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించారు. వీరి పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం.. తొలగింపు చట్టవిరుద్ధమని, వెంటనే విధుల్లోకి తీసుకోవాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అయినా 187 మందిని మాత్రం విధుల్లోకి తీసుకోలేదు. దీనిపై వారు కోర్టు ధిక్కరణ పిటిషన్ కూడా దాఖలు చేశారు.

జిల్లా వార్తలు

ఐటీడీఏ డీడీగా మణెమ్మ



మణెమ్మ

భద్రాచలం: భద్రాచలం ఐటీడీఏ ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్(డీడీ)గా పి.మణెమ్మ నియమితులయ్యారు. ఈమేరకు శాఖ కమిషనర్ క్రిస్టినా జెడ్ చొంగ్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆసిఫాబాద్ ఐటీడీఏ డీడీగా పనిచేస్తున్న ఆమెను భద్రాచలం బదిలీ చేశారు. కాగా, ప్రస్తుతం ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్ ఇన్‌చార్జ్ డీడీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అయితే మణెమ్మ భద్రాచలం రావడానికి ఆసక్తిగా లేకపోగా, ఇతర ప్రాంతానికి బదిలీ కోసం యత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

'నవోదయ'లో 11వ తరగతి ప్రవేశానికి 22న పరీక్ష

కూసుమంచి: కూసుమంచి మండలం పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయలో 11వ తరగతిలో ఖాళీ సీట్ల భర్తీ కోసం ఈ నెల 22న ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చంద్రబాబు తెలిపారు. ఇందుకోసం ఉమ్మడి ఖమ్మం జిల్లా నుండి 398 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, నవోదయ విద్యాలయలో ఉదయం 10.45 నుండి మధ్యాహ్నం 1.30గంటల వరకు జరిగే పరీక్షకు హాజరుకావాలని సూచించారు. పరీక్షప్యాడ్‌తో పాటు బ్లూ లేదా బ్లాక్ పెన్ను, ఆధార్‌కార్డు లేదా నివాస ధ్రువీకరణ పత్రంతో ఉదయం 10.30 గంటలకల్లా చేరుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో 77021 57196, 98484 02281 నంబర్లలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

కార్మికులపై నిర్లక్ష్యాన్ని విడనాడాలి

ఖమ్మంమయూరిసెంటర్: గ్రామపంచాయతీ కార్మికుల పోరాటం క్షుద్ర రాజకీయం కాదని.. బతుకుదెరువు, ఉద్యోగ భద్రత కోసం చేస్తున్న పోరాటమని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అయితే, 14 రోజులుగా 50 వేల మంది కార్మికులు సమ్మె చేస్తున్నా పట్టించుకోకపోవడం ప్రభుత్వ తీరుకు నిదర్శమని ఆరోపించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కానీ, 11వ వేతన సంఘం సిఫారసు మేరకు కానీ రూ.19 వేల కనీస వేతనం ఇవ్వాల్సి ఉన్నా పట్టించుకోకపోగా రూ.500 నుంచి రూ.1,000 పెంచి అదే గొప్పగా చెప్పుకుంటున్నారని తెలిపారు. ఇకనైనా ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని విడనాడి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రమాద బీమా అమలు చేయడంతో పాటు పని భారం తగ్గించాలని వారు డిమాండ్ చేశారు.

ఉద్యాన పంటలకు 'ఉపాధి' రాయితీ

- ఎస్సీ, ఎస్టీ, సన్న, చిన్నకారు రైతులంతా అర్హులే
- నీటి వసతి కలిగి ఐదెకరాల్లోపు భూమి ఉన్న వారికి అవకాశం
- మూడేళ్ల పాటు నిర్వహణ వ్యయం, రాయితీపై డ్రిప్ పరికరాలు
- ఉపాధి హామీ జాబ్‌కార్డు తప్పనిసరి

ఖమ్మంవ్యవసాయం: ఉపాధి హామీ పథకంలో ప్రభుత్వం ఉద్యాన పంటల సాగుకు పెద్ద పీట వేసింది. కూరగాయలు, పండ్లు, ఇతర ఉద్యాన పంటలకు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని రాయితీలతో కూడిన ప్రోత్సాహకాలను ప్రకటించింది. ఉపాధి హామీ పథకంలో పనిచేసే చిన్న, సన్నకారు రైతులకు మేలు జరిగేలా ఈ నిర్ణయాన్ని వెలువరించింది. జాబ్ కార్డు కలిగి ఉండి ఐదెకరాల్లో భూమి కలిగిన ఎస్సీ, ఎస్టీ, సన్న, చిన్నకారు రైతులకు ఈ పథకంలో అవకాశం కల్పిస్తారు. నీటి వనరులు ఉన్న రైతులు వరిసాగు చేస్తుండడంతో ఏటా సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతోంది. దీంతో వరికి ప్రత్యామ్నాయంగా అధిక ఆదాయాన్ని ఇచ్చే పండ్లు, ఉద్యాన పంటలను ప్రోత్సహించి రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా రాయితీలు ప్రకటించింది.



సత్తుపల్లి మండలంలో సాగు చేస్తున్న మామిడితోట

ఖమ్మం జిల్లాలో 3,158 ఎకరాలు

ఖమ్మం జిల్లాలో 3,158 ఎకరాల్లో ఉపాధి హామీ పథకం కింద ఈ ఏడాది ఉద్యాన పంటల సాగుకు ప్రణాళిక రూపొందించారు. నేలల రకాలు, వనరులను పరిగణనలోకి తీసుకొని అవకాశం కల్పిస్తారు. ఈమేరకు మామిడి 1,300 ఎకరాల్లో, కొబ్బరి వెయి ఎకరాల్లో, జామ 250, నిమ్మ, బత్తాయి 200 ఎకరాల చొప్పున, మునగ వంద ఎకరాల్లో, జీడి మామిడి 50, సీతాఫలం 24, సపోట, డ్రాగన్‌ఫ్రూట్, దానిమ్మ పదేసి ఎకరాలతో పాటు అల్ల నేరెడు నాలుగు ఎకరాల్లో సాగు చేయించాలనేది అధికారుల లక్ష్యం. కాగా, కూలీల ఖర్చు, మెటీరియల్, డ్రిప్ పరికరాలపై రాయితీని అన్ని పంటలకు ఎకరం చొప్పున పరిగణనలోకి తీసుకోనుండగా, డ్రాగన్ ఫ్రూట్‌కు మాత్రం అర ఎకరాన్ని పరిగణనలోకి తీసుకుంటారు.

మూడేళ్ల పాటు సంరక్షణ బాధ్యతలు

పండ్ల తోటల సంరక్షణ బాధ్యతలను మూడేళ్ల పాటు ప్రభుత్వమే చూస్తుంది. మొక్కలు, ఎరువుల కొనుగోలు, నిర్వహణ, గుంతలు తీయటం, మొక్కలు నాటడం వంటి వంటి పనుల అయ్యే ఖర్చు మూడేళ్ల పాటు ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా చెల్లిస్తుంది. మామిడి ఒక్కో మొక్కకు రూ.30, బత్తాయి మొక్కకు రూ.44 ఇలా అన్ని మొక్కలను చెల్లించడమే కాక ఎరువు కోసం ఒక్కో మొక్కకు రూ.50, నిర్వహణ ఖర్చునెలకు రూ.10 చొప్పున చెల్లిస్తారు. కాగా, గుంతలు తీయటం, మొక్కలు నాటడం వంటి పనులన్నీ ఉపాధి హామీ కూలీలతో చేయించాల్సి ఉంటుంది. ఇవేకాక బిందు సేద్యం పరికరాలను కూడా రాయితీపై అందజేస్తారు. ఐదెకరాల లోపు భూమి కలిగి ఉండి, ఉపాధి హామీ జాబ్ కార్డు కలిగిన రైతులను బిందు సేద్యం పథకంలో రాయితీకి అర్హులుగా నిర్ణయించారు. సాగునీటి వసతి కలిగి ఉన్న ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం, చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం రాయితీపై బిందు సేద్యం పరికరాల పంపిణీ చేయనున్నారు.

వివిధ పంటలకు అందిస్తున్న రాయితీలు
(ఎకరాకు రూ.ల్లో / డ్రాగన్ ఫ్రూట్ మాత్రం అర ఎకరాకు)

పంట	కూలీల ఖర్చు	మెటీరియల్	డ్రిప్	మొత్తం
డ్రాగన్‌ఫ్రూట్	1,06,272	1,44,000	29,859	2,80,131
దానిమ్మ	84,039	37,460	24,904	1,46,403
మునగ	74,392	20,500	35,646	1,30,538
సీతాఫలం	70,048	30,938	25,204	1,26,190
యాపిల్‌బేర్	50,848	26,938	25,204	1,02,990
బత్తాయి	43,882	19,236	31,013	94,131
జామ	48,243	21,820	22,418	92,841
నిమ్మ	48,243	21,160	22,418	91,821
మామిడి	40,791	13,815	28,971	83,577
జీడి మామిడి	40,791	13,395	28,971	83,157
సపోట	35,002	12,262	20,262	67,526
అల్లనేరేడు	23,426	7,694	16,666	47,786

రైతులు వినియోగించుకోవాలి



ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డు ఉన్న ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు ఉద్యానపంటల సాగును సద్వినియోగం చేసుకోవాలి. అన్ని పత్రాలతో ఉద్యాన అధికారులు, వ్యవసాయ విస్తర్ణాధికారులు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లను సంప్రదించాలి. ఈ పథకంపై జిల్లా వ్యాప్తంగా రైతుల్లో అవగాహన కల్పించనున్నాం.

– జి.అనసూయ, ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి, ఖమ్మం

ఖమ్మం బస్టాండ్‌ను తనిఖీ చేసిన ఈడీ

ఖమ్మం మామిళ్లగూడెం: ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీ వినోద్‌కుమార్ బుధవారం ఖమ్మం కొత్త బస్టాండ్‌లో తనిఖీ చేశారు. పలువురు ప్రయాణికులతో మాట్లాడిన ఆయన సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఖమ్మం రీజియన్‌లోని ఆరు డిపోల మేనేజర్లతో సమావేశమయ్యారు. ఆర్టీసీని లాభాల బాటలో నడిపించేలా అందరూ కృషి చేయాలని ఆదేశించారు. ఇన్‌చార్జ్ ఆర్ఎం భవానీప్రసాద్, డిపో మేనేజర్లు శ్రీనివాస్, స్వామి, దేవదానం, రామారావు, డి.వెంకటేశ్వర్లు, సత్తుపల్లి, ఖమ్మం సీఐలు విజయశ్రీ, రామయ్య తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మం బస్టాండ్‌లో పరిశీలిస్తున్న ఈడీ వినోద్‌కుమార్

ఆహార భద్రత ఎఫ్‌సీఐతోనే సాధ్యం

ఖమ్మం డివిజనల్ మేనేజర్ రంగప్రసాద్

ఖమ్మంవ్యవసాయం: దేశ ఆహార భద్రతలో భారత ఆహార సంస్థ(ఎఫ్‌సీఐ) కీలక పాత్ర పోషిస్తోందని సంస్థ ఖమ్మం డివిజనల్ మేనేజర్ బి.రంగప్రసాద్ నాయక్ వెల్లడించారు. ఖమ్మం కాల్వొడ్డులోని ఎఫ్‌సీఐ డివిజనల్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు చేరవేయడంలో ఎఫ్‌సీఐ కీలకంగా వ్యవహరిస్తోందని తెలిపారు. ఖమ్మం డివిజన్ పరిధిలో 88 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాముల్లో బియ్యం నిల్వ చేస్తుండగా, గతంలో అందించిన బియ్యం కాకుండా మరింతగా పోషక విలువలు ఉన్న బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ సహకారంతో సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. కాగా, 2022–23 సంవత్సరంలో ఖమ్మం డివిజన్‌లో 1.60 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సేకరించి, మన రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు దేశం నలుమూలలకు రైలు మార్గంలో సరఫరా చేస్తున్నామన్నారు. ప్రధానంగా కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు ఖమ్మం డివిజన్ నుంచి బియ్యం వెళ్తున్నాయని తెలిపారు. అనంతరం ఎఫ్‌సీఐ గోదాముల్లో బియ్యం నిల్వ విధానాన్ని మేనేజర్ రంగప్రసాద్ ప్రత్యక్షంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌సీఐ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎఫ్‌సీఐ గోదాంల్లో బియ్యం నిల్వలను వివరిస్తున్న మేనేజర్ రంగప్రసాద్

ఆర్టీసీ ఆర్ఎంగా వెంకన్న

ఖమ్మం మామిళ్లగూడెం: టీఎస్ ఆర్టీసీలోని పలువురు అధికారులను బదిలీ చేశారు. ఈమేరకు ఆర్టీసీ సికింద్రాబాద్ ప్రాంతీయ మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సీహెచ్. వెంకన్నను ఖమ్మం రీజినల్ మేనేజర్‌గా నియమించారు. ఇక్కడి ఆర్ఎం ప్రభులత సెలవులో వెళ్లడంతో డిప్యూటీ సీటీఎం భవానీప్రసాద్ ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కాగా, నూతన ఆర్ఎంగా నియమితులైన వెంకన్న రెండు, మూడు రోజుల్లో బాధ్యతలు స్వీకరించే అవకాశముంది.

పామాయిల్ ఫ్యాక్టరీలో పవర్‌ప్లాంట్‌కు భూమిపూజ

అశ్వారావుపేట: అశ్వారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరీ ఆవరణలో రూ.39కోట్లతో నిర్మించనున్న 2.5 మెగావాట్ల పవర్ ప్లాంట్‌కు ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు బుధవారం భూమిపూజ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అశ్వారావుపేటను సొంత నియోజకవర్గంగా భావించి అభివృద్ధికి భారీగా నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. అశ్వారావుపేటలో రూ.150 కోట్లతో మరో పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మించేందుకు ప్రభుత్వం నిర్ణయించి నిధులు కూడా విడుదల చేసిందని చెప్పారు. ఈ ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తయితే 2,000 నుంచి 2,500 మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభిస్తుందని తెలిపారు. ఈకార్యక్రమంలో ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి, సీనియర్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామమూర్తి, మేనేజర్లు బాలకృష్ణ, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు

ఎనిమిది రేక్‌లకు తగ్గకుండా బొగ్గు రవాణా

సత్తుపల్లిరూరల్: సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని సత్తుపల్లి జేవీఆర్ ఓసీలో ఈపీసీ సీహెచ్‌పీని బుధవారం ఏరియా జీఎం ఎం.షాలేంరాజు, ఏరియా ఇంజనీర్ రఘురామరెడ్డి సందర్శించారు. కోల్ స్టాక్ బంకర్లను పరిశీలించిన వారు రోజుకు ఎనిమిది రేక్‌లకు తగ్గకుండా బొగ్గు రవాణా చేయాలని సూచించారు. అలాగే, సీహెచ్‌పీ బంకర్ చుట్టుపక్కల డస్ట్, బొగ్గు పేరుకుపోకుండా పర్యవేక్షించాలని తెలిపారు. అధికారులు కోటిరెడ్డి, సోమశేఖర్, రమణారెడ్డి, రాకేష్, ముక్క మోహన్, ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.



బొగ్గు రవాణాను పరిశీలిస్తున్న జీఎం, అధికారులు